నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 18 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## కుమ్రం భీం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 17: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రెండు రోజుల నుంచి వర్షాలు కురవడంతో కుమ్రం భీం ప్రాజెక్టులో వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి అధికారులు నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. బుధవారం 1146 కూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండడంతో 4, 5 వ గేట్లను 0.30 మీటర్ల మేర ఎత్తి 1314 కూసెక్కుల నీటిని విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాగులు వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.


కుమ్రం భీం ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

## ముగిసిన అటవీ బీట్ అధికారుల కౌన్సెలింగ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూలై 17 : సాధారణ బదిలీల్లో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో అటవీ శాఖ బీట్ అధికారుల బదిలీల ప్రక్రియ బుధవారం ముగిసింది. డీఎఫ్‌వో నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఆధ్వర్యంలో ఎఫ్‌డీవో వేణు బాబు, ఎఫ్ఆర్వో అప్పలకొండ కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో 57 మందికి బదిలీ జరిగిందని నిబంధనల ప్రకారం ఈ ప్రక్రియను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో నీరజ్ టిబ్రివాల్

# షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలి

**సీఎం రేవంత్‌రెడ్డికి సొంత నియోజకవర్గంపై ఉన్న శ్రద్ధ వెనుకబడ్డ ప్రాంతాలపై లేదు**

- సిర్పూర్ నియోజకవర్గంలో ప్రాజెక్టులను పట్టించుకోవాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు షరతులు లేని రుణ మాఫీ చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మాశాలీ సేవా సంఘం భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత నియోజకవర్గానికి రూ.4350 కోట్లు మంజూరు ప్రకటించుకున్నారని, రాష్ట్రంలో సిర్పూర్ నియోజకవర్గం లాంటి వెనుబడిన ప్రాంతాలకు సైతం నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కొందరు నాయకులు కబ్జాలకు, గూండాగిరి చేస్తున్నారని, అక్రమ దందాలకు ప్రోత్సహిస్తూ ఈ ప్రాంతాన్ని దోచుకుంటున్నారని, ఇకా వారి ఆటలు సాగనివ్వబోమన్నారు. దొంగలు పార్టీ మారినంత బీఆర్ఎస్ బలహీనం కాదని, పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే ప్రస్తుత ఎమ్మెల్యే ఈ నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా ధర్నాలు చేయడం సరికాదని, ప్రభుత్వాన్ని నిలదీసి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. 2008 కౌటాల మండలంలోని ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు కోసం 6 వేల ఎకరాల భూమిని కాంగ్రెస్ సర్కారు సేకరించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.9 వేల కోట్లు మంజూరు చేయగా, రూ.1700 కోట్లు ఖర్చు చేసి కాలువలు తవ్వి వదిలేశారని, ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం రాలేదని తెలిపారు. 8 లిఫ్ట్ ఇరిగేషన్లు ఉన్నా ఒక్కటీ పనిచేయడం లేదని, ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసి లిఫ్ట్ ఇరిగేషన్లను పునరుద్ధరించాలన్నారు. తలాపున ప్రాణహిత పారుతున్నప్పటికీ సాగునీరందక వర్షాల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆడ, కుమ్రం భీం, పీపీ రావు ప్రాజెక్టులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో కాలువలు నిర్మించాలన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని ఇస్గం పరిధిలోని చెరువులు, కాలువలు పూడికతో నిండిపోవడంతో సాగు నీరు అందని ద్రాక్షగా మారిందన్నారు. అటవీ ప్రాంతం శివారులోని గ్రామాల ప్రజల భూముల్లో రాత్రి వేళల్లో అటవీ శాఖ అధికారులు మొక్కలు నాటుతున్నారని, కందకాలు తవ్వుతున్నారని ఆరోపించారు. జాతీయ పులుల సంరక్షణ సంస్థ, వైల్డ్‌లైఫ్ బోర్డు నుంచి అనుమతులు లేకుండా అంకుసాపూర్ గ్రామ పంచాయతీలో పరిధిలో ఇథనాల్ ప్లాంట్ నిర్మిస్తుంటే అటవీ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడవం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల పొత్తు ఉండడంతోనే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సిర్పూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా లెండుగూరే శ్యాంరావును ఎన్నుకున్నట్లు తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణ, మండలాల వారీగా సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గం సమన్వయ కమిటీ కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు, బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్, ఖాజా సమియొద్దీన్, అంబాల ఓదెలు, రాజ్‌కుమార్, కౌన్సిలర్ మిన్‌హాజ్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# కళాకారులకు పంగనామం

- చెన్నూర్ ఎమ్మెల్యే కోసం ప్రచారం చేస్తే డబ్బులు ఇవ్వలేదు
- 24 మంది కళాకారులకు రూ.1.60 లక్షల టోపీ
- డబ్బులు అడిగితే చీదరించుకుంటున్న ఎమ్మెల్యే పీఏ
- 'నమస్తే తెలంగాణ'కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు

మంచిర్యాల, జూలై 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గెలుపు కోసం గజ్జె కట్టి ఆటఆడి, పాటపాడిన కళాకారులకు గెలిచిన తర్వాత ఎమ్మెల్యే వివేక్, వివేక్ పీఏ రమణారావు కుచ్చుటోపీ పెట్టడం చర్చనీయాంశం అయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గడ్డం వివేక్ పోటీ చేయగా వివేక్ గెలుపు కోసం రెండు కళాబృందాలు ప్రచారం చేశాయి. ఎర్రటి ఎండను కళాకారులు లెక్కచేయకుండా 16 రోజులపాటు చెన్నూర్ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించగా రెండు బృందాలకు ఒక్కో బృందానికి రూ.25 వేల చొప్పున రోజుకు రూ.50వేల చొప్పున చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. చెన్నూర్ డివిజన్‌గా ఒక బృందం, మందమర్రి డివిజన్‌గా మరో బృందం రెండు బృందాలుగా పని చేయగా మొత్తం 24 మంది కళాకారులు రేయింబవళ్లు కష్టపడి కళాకారులు వారి ప్రచారాన్ని నిర్వహించారు. 16 రోజులుకు ఒక్కో రోజుకు రూ.50 వేల చొప్పున మొత్తం రూ.8 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. రూ.6.4 లక్షలు చెల్లించిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ పీఏలు మిగతా రూ.1.6 లక్షలు కళాకారుల బృందానికి ఇవ్వడానికి మనసు రావడం లేదు. ప్రచార సమయంలో పార్టీ ఆధ్వర్యంలో తిండిపెట్టామని, వసతి కల్పించామని రూ.1.60 లక్షలు ఇవ్వడం కుదరదని వివేక్ ప్రధాన పీఏ రమణారావు చెపుతున్నాడని కళాబృందం టీం ఇన్‌చార్జి సురేందర్ తెలిపారు. వివేక్ ఎన్నికలలో గెలిచి ఎనిమిది నెల గడుస్తున్నా తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వకపోవడంపై కళాకారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కూలీ కింద వచ్చి గజ్జకట్టి ఆడిపాడితే తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని అడిగితే వివేక్ పీఏ రమణారావ్ పట్టించుకోకపోవడమే కాకుండా ఎస్సీలంతా ఇంతే అంటూ అవమానిస్తూ మాట్లాడుతున్నారని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొట్టకూటి కోసం పనిచేసి మాకు రావాల్సిన డబ్బులు అడిగితే పీఏ రమణా రావ్ అధికారంలో ఉంది మేమే నని, ఎవరికి చెప్పినా, ఏ మీడియాలో వచ్చినా మాకు ఒరిగేదేమి లేదని అహంకారంగా మాట్లాడుతున్నాడని కళాకారులు తమ గోడును 'నమస్తే తెలంగాణ' ముందు వెల్లబోసుకున్నారు. దళితుల దగ్గర పీఏగా పనిచేస్తున్న రమణారావు దళితులపై అహంకారపూరితంగా మాట్లాడుతున్న అతన్ని కొనసాగిస్తూ ముందుకు సాగడం వల్ల ఎమ్మెల్యే వివేక్ ఆంతర్యమేమిటో అని నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుతున్నారు.



చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల సమయంలో వివేక్ గెలుపు కోసం పాటలు పాడుతున్న కళాకారులు(ఫైల్)

### ఎమ్మెల్యే న్యాయం చేయాలి..

**- సురేందర్, కళాబృందం టీం ఇన్‌చార్జి.**

చెన్నూర్ ఎమ్మెల్యేగా వివేక్ గెలుపు కోసం రాత్రి పగలు తేడా లేకుండా ఆడిపాడిన మాకు చెల్లించాల్సిన డబ్బులు మాకు చెల్లించి మా బృందానికి న్యాయం చేయాలి. పొట్టకూటి కోసం కళాకారులుగా ఆడిపాడిన తమకు సకాలంలో డబ్బులు చెల్లించాల్సింది పోయి వివేక్ సార్ పీఏ రమణారావ్ మా దళితులను చిన్నచూపు చూస్తూ అవమానించేలా మాట్లాడుతున్నాడు. డబ్బు, అధికారం ఉందని అవమానిస్తున్నావు. మా కళాకారుల కడుపు కొట్టాలని చూస్తున్నావు. రమణారావ్ పని తీరు వల్ల ఇప్పటికే చెన్నూర్ నియోజకవర్గంలో ఎంత నష్టం జరగాలో అంతకన్నా ఎక్కువనే జరిగింది. పీఏతో ముందుకు వెళుతూ, ఆయన మాటలు వింటే రానున్న రోజుల్లో తీవ్ర నష్టం జరగనుంది. ఇప్పటికైనా మా కళాకారులకు జరిగిన అన్యాయంపై దృష్టిసారించి మాకు న్యాయం జరిగేలా చూడాలి. లేదంటే మా కళాకారులతో మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతాం.

# యాదవ్‌రావ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

జైనూర్, జూలై 17: తెలంగాణ ఉద్యమ నాయకుడు కినక యాదవ్‌రావ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. యాదవ్‌రావ్ ఇటీవల మరణించగా బుధవారం ఆయన కుటుంబాన్ని మండలంలోని పారా గ్రామంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అతని భార్యకు పోచ్చంలొద్దిలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం కల్పిస్తానని హామీ ఇచ్చారు. యాదవ్ రావ్ కుటుంబానికి ఎల్ల వేళలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అధైర్యపడవద్దని భరోసానిచ్చారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకురాలు మర్సకోల సరస్వతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్ను పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, బీఆర్ఎస్ నాయకులు ఖదీర్ అహ్మద్, విశాల్ కేంద్రె గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


యాదవ్‌రావ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# విజృంభిస్తున్న జ్వరాలు

- గ్రామాల్లో పారిశుధ్య పనులు అస్తవ్యస్తం
- జిల్లా వ్యాప్తంగా 195 డయేరియా, 36 టైఫాయిడ్, 8 మలేరియా, 2 డెంగీ కేసులు నమోదు
- 63 ప్రభావిత గ్రామాల గుర్తింపు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 17 (నమస్తే తెలంగాణ): జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాలతో గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందడం, నీటి వనరుల్లో కలుషిత నీరు చేరడంతో ప్రజలకు వ్యాధులు వ్యాపిస్తున్నాయి. జిల్లాలో 63 మలేరియా, టైఫాయిడ్ ప్రభావిత గ్రామాలను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు జిల్లాలో 195 డయేరియా, 36 టైఫాయిడ్, 8 మలేరియా, 2 డెంగీ కేసులను అధికారులు గుర్తించారు. వాంకిడి పీహెచ్‌సీ పరిధిలో 3, లోనవెల్లి పీహెచ్‌సీ పరిధిలో 3, జైనూర్, గిన్నెధరి పీహెచ్‌సీల పరిధిలో 2 మలేరియా కేసులు, భట్‌పల్లి పీహెచ్‌సీలో 1, దహెగాం పీహెచ్‌సీల పరిధిలో డెంగీ కేసు నమోదైంది. వర్షాకాలంలో వ్యాపించి వ్యాధుల అదుపునకు వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు సరిగా నిర్వహించకపోవడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయి.


రోగులతో కిటకిటలాడుతున్న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఓపీ

### జిల్లాలో 63 ప్రభావిత గ్రామాల గుర్తింపు

జిల్లాలో మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాపించే 63 ప్రభావిత గ్రామాలను అధికారులు గుర్తించి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తున్నది. వ్యాధులు విజృంభించకుండా ఈ గ్రామాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. కేసు నమోదైన గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేయడంతో పాటు, ఆ గ్రామంలోని వారందరికీ ప్రత్యేకంగా రక్త పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పారిశుధ్య పనులు చేపట్టడం, కలుషిత నీరు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో టైఫాయిడ్, డయేరియా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీంతో అధికారులు ఏజెన్సీ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తున్నది. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టని వైద్య శాఖ వ్యాధులు విజృంభించిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడంపై విమర్శలు వస్తున్నాయి.

### 91 గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

వర్షాకాలం వచ్చిందంటే వైద్య సేవలు అందించేందుకు వెళ్లేందుకు వీలుకాని 91 గ్రామాలను వైద్యాధికారులు గుర్తించారు. ఈ గ్రామాలకు సరైన రోడ్లు లేకపోవడం, వాగులపై వంతెనలు లేకపోవడంతో ఆ గ్రామాలకు వెళ్లలేమని అధికారులు గుర్తించారు. తిర్యాణి, లింగాపూర్ వంటి మారుమూల గ్రామాలతో పాటు ఆసిఫాబాద్ మండలంలోని గ్రామాలు కూడా వర్షాకాలంలో వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. వర్షాకాలంలో రాకపోకలు సరిగా లేని ఈ 91 గ్రామాల్లో వ్యాధులు వ్యాపిస్తే ప్రజలు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. వర్షాకాలంలో వైద్య బృం దాలు వెళ్లలేని గ్రామాల్లోని గర్భిణులను ప్రసవ తేదీల కంటే వారం, పది రోజుల ముందే హాస్పిటల్‌కు తీసుకువస్తున్నామని, లేదా హాస్పిటల్ సమీపంలో ఉన్న బంధువుల ఇండ్లల్లో ఉంచుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ తెలిపారు.


బట్‌పల్లిలో బురదమయమైన రోడ్డు

### పారిశుధ్య పనులు అస్తవ్యస్తం..

వ్యాధులు ప్రబలడానికి గ్రామాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులే కారణమని తెలుస్తున్నది. సర్పంచులు లేకపోవడం, ప్రత్యేకాధికారులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారులు గ్రామాల వైపు రాకపోవడంతో పారిశుధ్య పనులను ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో మురుగు కాలువలు నిండిపోవడం, రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోయి వ్యాధులు విజృంభించేందుకు కారణమవుతున్నాయి. ప్రత్యేక అధికారులు మండల కేంద్రాల్లో తప్ప గ్రామాలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖతోపాటు, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నప్పటికీ ఆ మేరకు క్షేత్ర స్థాయిలో పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

# గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మందమర్రి, జూలై 17: పట్టణంలోని చెంచుకాలనీలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్న గుర్రాల అనితను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ వెల్లడించారు. మందమర్రి పట్టణంలోని విద్యానగర్(చెంచు కాలనీ)కి చెందిన అనిత కొన్ని రోజులుగా విక్రయిస్తున్నది. అదే కాలనీకి చెందిన మక్కల గంగాధర్‌తో చంద్రాపూర్ నుంచి రెండు కిలోల గంజాయిని తెప్పించింది. ఆ గంజాయిని వినియోగదారులకు ప్యాకెట్‌కు రూ.300ల చొప్పున అనిత విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం ఆమె నివాసంతో చుట్టు పక్కల తనిఖీ చేయగా రూ.25 వేల విలువైన కిలో వంద గ్రాముల గంజాయి లభించింది. గంజాయి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని ఆయన చెప్పారు. గంజాయి విక్రయించగా రూ.27,200 నగదు, రెండు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని అనితను రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. గంజాయిని అమ్మినా, కొన్నా, సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రాము, మహిళా హెడ్ కానిస్టేబుల్ పద్మ, హోంగార్డు ఉమను రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అభినందించారు.


మందమర్రిలో వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

## రూ.11.22 లక్షల విలువైన గుట్కా పట్టివేత

వాంకిడి, జూలై 17 : మహారాష్ట్ర నుంచి ఆసిఫాబాద్ పట్టణానికి అక్రమంగా తరలిస్తున్న రూ.11.22 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి మహారాష్ట్ర నుంచి వాంకిడి వైపు వస్తున్న వాంకిడికి చెందిన షహీద్ తన ఆటోలో వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. ఆటోలో 30 గుట్కా సంచులు లభించాయి. వీటి విలువ సుమారు రూ.11.22 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఈ తనిఖీల్లో వాంకిడి ఏఎస్ఐ పోశెట్టి, హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌రావు, కానిస్టేబుల్ దుర్గా ప్రసాద్ ఉన్నారు.


ఆటోలో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు


లక్షెట్టిపేట బస్టాండ్‌లో బోర్డులు లేని ప్లాట్ ఫాంలు

## మా ఊరి బస్సు ఎక్కడ ఆగుతదో..!

*లక్షెట్టిపేట బస్టాండ్‌లో ఏ బస్సు ఏ ప్లాట్ ఫాం వద్ద ఆగుతాయో వివరాలతో బోర్డులుండేవి. నెల రోజుల క్రితం వాటిని తొలగించారు. కొత్త బోర్డులను కాంట్రాక్టర్ ఏర్పాటు చేయకపోవడంతో నెల రోజులుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంపై మంచిర్యాల డీఎంని వివరణ కోరగా టెండర్ పొందిన వ్యక్తితో మాట్లాడి బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.*

*- లక్షెట్టిపేట, జూలై 17*




